క్లుప్తంగా

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందజేసి..



కాకినాడ జీజీహెచ్‌లో సత్యనారాయణకు పింఛను అందజేస్తున్న వరలక్ష్మి

సామర్లకోట: పింఛను పంపిణీ గడువు ముగుస్తుండటంతో వలంటీర్లు చొరవ చూపి, లబ్ధిదారులు ఎక్కడుంటే అక్కడకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. అయోధ్యరామపురం 18వ సచివాలయం పరిధిలోని వృద్ధాప్య పింఛనుదారుడు పాలకుర్తి సత్యనారాయణ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న వలంటీర్ ఉండవిల్లి వరలక్ష్మి మంగళవారం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి, లబ్ధిదారుడికి పింఛను అందజేసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

రేషన్ షాపులపై దాడులు

సామర్లకోట: పట్టణంలోని రేషన్ షాపులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు జరిపారు. స్థానిక ఉప్పువారి వీధి, కుమ్మర వీధుల్లో ఉన్న రేషన్ షాపుల్లో సరకులను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఆయా షాపుల్లో సరకుల నిల్వలో తేడాలు ఉండటంతో, రెండు షాపులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు వారిపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సిఫార్సు చేశారు.

ముంపు బాధితులకు సాయం



సామర్లకోట 31వ వార్డులో నిత్యావసరాలు అందజేస్తున్న కౌన్సిలర్ సురేష్‌కుమార్

సామర్లకోట: మిచాంగ్ తుఫాన్ కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 31వ వార్డు ముంపునకు గురికావడంతో, కొన్ని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. దీంతో ఆ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు చేపట్టారు. వార్డులోని 20 కుటుంబాలకు 10 రోజులకు సరిపడే కూరగాయలు, బియ్యం, కిరాణా సామగ్రితో పాటు పాలు అందజేశారు. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటా తిరిగి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టేలా సురేష్‌కుమార్ చర్యలు తీసుకున్నారు.

పంచారామ క్షేత్రంలో కొనసాగుతున్న పూజలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో 22వ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. తెల్లవారుజామున గోపూజతో పూజలు ప్రారంభించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ఆలయం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, వెలిగించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పారిశ్రామిక వేత్త అబంటి సుబ్రహ్మణ్యం, అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.

అలరించిన జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జరిగిన జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి జ్యోతిర్లింగార్చన అలరించింది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసే భక్తుల కోసం ఆలయ దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చనను ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం వెలిగించాక జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు.



చేబ్రోలులో వెదజల్లే పొలంలో నీరు చేరిన దృశ్యం



ఏకే మల్లవరంలో ధాన్యాన్ని తరలించేలా రైతులకు సూచనలిస్తున్న అధికారులు



గొల్లప్రోలు మండలం దుర్గాడలో నేలకొరిగిన అరటి చెట్లు



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నేలకొరిగిన వరి పంట

రైతన్నకు దన్నుగా..

- అధికారుల అప్రమత్తతతో తగ్గిన నష్టాలు
- అధిక వర్షాలతో దెబ్బతింటున్న పంటలు



చేబ్రోలులో నేలకొరిగిన వరి పంటను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఏఓ సత్యనారాయణ

పిఠాపురం: తుపాను వచ్చిందంటే ఏ రకమైన పంటలైనా నశనం చేస్తుంది. రైతులకు నష్టమే మిగుల్చుతుంది. కాని అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి రైతులను అప్రమత్తం చేయడంతో పాటు వారికి వెన్నుదన్నుగా నిలిచారు. దీంతో పంట నష్టం ఎక్కువ లేకుండా ఆపగలుగుతున్నారు. ప్రకృతిని ఆపడం ఎవరితరం కాక పోయినా ముందు జాగ్రత్తల ద్వారా జరిగే నష్టాలను మాత్రం నివారించడంలో అధికారులు సఫలీకృతులవుతున్నారు. గత రెండు రోజులుగా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు వరి చేలు, అరటి, మిరప, వంగ, టమాటా, దొండ, ముగస వంటి పంటలు దెబ్బతిన్నాయి. ఖరీఫ్ కోతలు పూర్తయ్యి వరి నూర్పులు మాసూళ్లు జోరుగా సాగుతుండగా రబీకి రంగం సిద్ధం చేస్తున్నారు. మిగిలినవి వర్షాలతో ఆలస్యమయ్యే పరిస్థితి ఎదురైంది. ఒక పక్క వరి కోతలు పూర్తయిన పొలాల్లో రబీ సాగుకు దమ్ములు ముమ్మరం చేశారు. ఎక్కువగా వెదజల్లే పద్ధతిలో నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం కావడంతో నారుమళ్లు లేకుండానే నాట్లు చేపట్టారు. వాటిలోకి వర్షపు నీరు అధికంగా చేరడంతో నాట్లు దెబ్బతినే పరిస్థితి ఎదరైనట్టు రైతులు వాపోతున్నారు. యంత్రాలతో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోడానికి వర్షం అడ్డంకిగా మారడంతో రైతన్నలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల బాట పట్టారు. ఎక్కడ ధాన్యం రాశులు ఉన్నా వాటిని పరిశీలించి వెంటనే కొనుగోలు కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరని ధాన్యం ఉంటే వాటికి రక్షణ కల్పించడానికి బరకాలను రైతులకు అందించి రక్షణ కల్పిస్తున్నారు. ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా వెను వెంటనే కొనుగోళ్లు పూర్తి చేసి సురక్షితంగా ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాట్లు అధికారులే చేపట్టారు. ఇప్పటికే పిఠాపురం నియోజకవర్గంలో గత రెండు రోజుల్లో 40 వేల క్వింటాళ్ల వరకు ధాన్యాన్ని సేకరించినట్టు అధికారులు తెలిపారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు రైతులకు రక్షణగా నిలిచి సామగ్రి సరఫరా చేయడంతో పంట నష్టం తగ్గిందని అధికారులు చెబుతున్నారు.



నీట మునిగిన సామర్లకోట జయలక్ష్మి థియేటర్ రోడ్డు



చెరువుగా మారిన సామర్లకోట బస్ కాంప్లెక్స్



వర్షాలకు నీట మునిగిన వరి పనలను వ్యవసాయాధికారులకు చూపుతున్న రైతు

తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి వర్షం

సామర్లకోట: మిచాంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన వర్షం కారణంగా పట్టణంలోని అన్ని రోడ్లు చెరువులుగా మారాయి. ప్రధాన డ్రైన్లపై శ్లాబ్‌లతో మూసివేయడం వల్ల వర్షపు నీరు పారేందుకు మార్గం లేకుండా పోయింది. డ్రైన్లలో పూడిక తీతకు అవకాశం లేకపోవడంతో అవి పొంగి ప్రవహించాయి. ఈ క్రమంలో బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్, సత్యనారాయణపురం, జయలక్ష్మి థియేటర్, సంగీతరావుపేట, వీర్రాఘవపురం, కొత్తూరు, భాస్కర్‌నగర్, సాయినగర్, గణేష్ కాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైన్ల ఆక్రమణపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావును వివరణ కోరగా, రోడ్లపై నీరు డ్రైన్లలోకి పారేందుకు వీల్లేకుండా శ్లాబ్‌లు వేసిన వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. నీటిలో మునిగిన వరి పనల ధాన్యం రంగు మారకుండా ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రైతులకు సూచించినట్టు మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు.

మత్స్యకారులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే దొరబాబు



గంగరాజుకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: మత్స్యకార కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు మాయాపట్నానికి చెందిన రాకాతి గంగరాజు బోటు ఇటీవల సముద్రంలో అలల తాకిడికి అమీనాబాదులో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ గోడకు ఢీకొట్టడంతో బోల్తా పడింది. దీంతో గంగరాజును మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించి, రూ.25వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో అందించే భృతిని రూ.4వేల నుంచి 10వేలకు పెంచిన అందించడం జరుగుతుంది. ఆయిల్ సబ్సిడీ రూ.6నుంచి 9కి పెంచడమే కాకుండా 1265బోట్లుకు అందజేయడం జరుగుతుందన్నారు. అమీనాబాదు తీరప్రాంతంలో రూ. 422కోట్లతో నిర్మిస్తున్న మేజర్ హార్బర్ నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. ఈ హార్బర్ నిర్మాణంతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారతాయన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రంలో వసతులు

- అధికారులను అప్రమత్తం చేస్తున్నాం
- ఆర్డీఓ కిషోర్‌కుమార్



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కిషోర్ కుమార్

కొత్తపల్లి: తీరప్రాంతంలో ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి అక్కడ అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆర్డీఓ కిషోర్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పాడ శివారు సూరాడపేట ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, కోతకు గురవుతున్న తీరప్రాంతాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిచాంగ్ తుపాను ప్రభావం తగ్గే వరకూ పునరావాస కేంద్రాన్ని కొనసాగిస్తామన్నారు. కేంద్రాల్లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనంతో పాటు పిల్లలకు పాలు, గుడ్లు కూడా అందిస్తున్నామన్నారు. సుమారు 400 మందికి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. ఆయన వెంట తహసీల్దారు ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు



వల్లూరుకు చెందిన రైతు పంటను రైస్‌మిల్లుకు తరలిస్తున్న వ్యవసాయాధికారులు

సామర్లకోట: తుఫాన్ కారణంగా వరి పంట నష్టం జరుగుతుందని రైతులు ఆందోళన చెందవలసిన పని లేదని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య అన్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో ఆయా ఆర్బీకేల ఏఏఓలతో కలిసి పొలాలను పరిశీలించారు. ధాన్యం రంగు మారకుండా రైతులకు సూచనలు ఇచ్చారు. పొలాల్లో నీటిని బయటకు పంపే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పనలపై ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు తరలించడానికి సిద్ధంగా ఉంటే రవాణాకు ఏర్పాట్లు చేస్తామని అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉండూరు, వల్లూరు, అచ్చంపేట, గొంచాల గ్రామాల్లో పంటలను పరిశీలించామని సత్య చెప్పారు.

తీరప్రాంతాన్ని పరిశీలించిన బీజేపీ నాయకులు

కొత్తపల్లి: కోతకు గురయిన ఉప్పాడ తీరప్రాంతాన్ని మంగళవారం భారతీయ జనతాపార్టీ నాయకులు పరిశీలించారు. సూరాడపేటలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పిఠాపురం కన్వీనర్ బుర్రి కృష్ణరాజు, కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాసరావు, వీవర్స్ సెల్ స్టేట్ కో కన్వీనర్ రవణం సుబ్రమణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకట సూర్యనారాయణరావు, గండికొండల రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్ళకుర్తి రామేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొమ్మిరెడ్డి వీరబద్రరావు తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

సామర్లకోట: సమాజాభివృద్ధికి యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పీబీ దేవం శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. సమితి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, నువ్వుల బాబ్జి, సూర్యచంద్రరావు, తేలుగుంట్ల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో అల్లాడిన రైతాంగం

అన్నదాతలను బెంబేలెత్తిస్తున్న మిచాంగ్



కాండ్రకోటలో నీటిలోని వరి పంటను శుభ్రం చేసుకుంటున్న రైతు



కళ్లాల్లో వరి ధాన్యం రాశి వద్ద రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ అధికారులు

పెద్దాపురం: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యారు. తడిచిన పంటను ఒడ్డుకు చేర్చుకునే పనిలో మునిగిపోయారు. కనీసం చివరి గింజైనా దక్కుతుందన్న ఆశతో పంటను ఒబ్బిడి చేసుకుంటున్నారు. పంట నూర్చుకునే అవకాశం కూడా లేకుండా పోయింది. పెద్దాపురం నియోజవర్గంలోని గ్రామాలన్నీ దాదాపు ఇదే పరిస్థితి. కళ్లాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కూడా లేకపోవడంతో చేలలో పంటను రోడ్డుపైకి చేరుస్తున్నారు. రహదారులనే కళ్లాలుగా చేసుకుని, పంట ఒబ్బిడి చేసుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 25 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగైంది. ఎక్కువగా ఎంటీయూ 7029, బీపీటీ 5204, ఎంటీయూ 1064, ఆర్‌జీఎల్, స్వర్ణ, రీసెర్చ్ వరి వంగడాలు సంపద తదితర వాటిని రైతాంగం సాగు చేసింది. సెగ్మెంట్‌లోని కాండ్రకోట, కట్టమూరు, గుడివాడ, పెద్దాపురం, తూర్పుపాకలు, వేమవరం, నవర, మేడపాడు, వేట్లపాలెం తదితర గ్రామాల్లో సుమారు 50 శాతం వరి పంట నీటమునిగినట్టు వ్యవసాయాధికారుల అంచనా. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి కాలువలు ఉప్పొంగాయి. ఈదురు గాలులకు విద్యుత్ వైర్లు తెగి పడడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సిద్ధం

రైతులు పంట దిగుబడిపై అధైర్యపడాల్సిన పని లేదని, ప్రతి రైతు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ జేఎస్ రామారావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్ కుమార్, తహసీల్దార్ వి.జితేంద్రతో కలిసి ఆయన వరి పంటలను పరిశీలించారు. ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ఎక్కడ రంగు మారిన ధాన్యం ఉన్నా, రైతుల నుంచి నేరుగా, అధికార యంత్రాంగం కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే 24 గంటల్లో ధాన్యాన్ని తేమ శాతం బట్టి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఫిర్యాదు చేయవచ్చని ఆర్డీఓ తెలిపారు.

తీరంలో అలజడి

- కడలిలో కలిసిపోతున్న మత్స్యకార గృహాలు
- అధికారులు అప్రమత్తం



ఉప్పాడ తీరంలో కోత వల్ల కూలిపోతున్న గృహం



సముద్ర గర్భంలో కలిసిపోతున్న తీరాన్ని చూస్తున్న మత్స్యకారులు

కొత్తపల్లి: తుపాను ప్రభావంతో కడలి కల్లోలంగా ఉంది. తీరంలో అలలు ఉవ్వెత్తిన ఎగసిపడుతున్నాయి. ఉప్పాడ తీరంలో కెరటాలు విరుచుకు పడుతుండడంతో మత్స్యకారుల గృహాలు కడలిలో కలిసిపోతున్నాయి. ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. మత్స్యకారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అలల తాకిడికి ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. రక్షణగోడగా వేసిన బండరాళ్లు సైతం కెరటాల ఉధృతికి రోడ్డుమీద పడుతున్నాయి. దీంతో పోలీసులు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. మండలంలో భారీగా కురిసిన వర్షానికి జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. పంటలు నీట మునిగాయి. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు తగిన సూచనలు ఇచ్చారు. సుమారు 45హెక్టార్ల వరి నేలనంటిందని వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు తెలిపారు. సుమరు 10 హెక్టార్ల వరి నీట మునిగి పోయింది.

ఈసీ ఆదేశాలు పాటించాల్సిందే..



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పక పాటించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జేఎస్ రామారావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఛాంబర్‌లో మంగళవారం ఓటర్ జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలపై ప్రజా ప్రతినిధులు మరింత అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిధిలో 2,08,930 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుషులు 1,03,001, మహిళలు 1,05,916, ఇతరులు 13 మంది ఓటర్లతో జాబితాను ప్రచురించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ జితేంద్ర, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, మేనేజర్ జ్యోతిరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, చింతా శ్రీనివాసరావు(వైఎస్సార్ సీపీ), రంధి సత్యనారాయణ (టీడీపీ)తో పాటు వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కొండెవరంలో సుడిగాలి బీభత్సం

- ఎగిరిపడిన 50 ఇళ్ల పైకప్పులు
- భయాందోళనతో పరుగులు తీసిన ప్రజలు
- సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికారులు



పైకప్పు విరిగిపడడంతో మిగిలిన ఇంటి శిథిలాలు



పైకప్పులు కూలిన గృహాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్



సహాయక చర్యల్లో అధికారులతో వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపల్లి: కొండెవరం ఇందిరా కాలనీలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు సుడిగాలి బీభత్సం సృష్టించింది. గాలి అతివేగంగా రావడంతో చూస్తుండగానే ఇంటిపై కప్పులు ఎగిరిపోవడంతో బాధితులు భయాందోళనలతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఇంటి పైకప్పు పెంకులు, రేకులు గాలిలోకి తేలాయి. గాలులు కారణంగా పలు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సుమారు 50 ఇంటి పైకప్పులు ఎగిరిపోవడంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. దీంతో అధికారులు అప్రమత్తమై సహాయక చర్యలు చేపడుతున్నారు. పూర్తి స్థాయిలో నష్టాన్ని అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికను అందిస్తామని తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు దృష్టికి కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, ఉప సర్పంచి మేడిశెట్టి శ్రీరాములు తీసుకువెళ్లారు.